

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

## నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

మిర్యాలగూడ, మే 10: నెల్లికల్ లిఫ్ట్ ఇరిగేషన్ కింద భూ సేకరణ పూర్తయినందున బిల్లుల చెల్లింపు, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శనివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులపై మిర్యాలగూడ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నెల్లికల్ లిఫ్ట్‌నకు సంబంధించి భూ సేకరణ పేపర్ నోటిఫికేషన్ ఇదివరకే జారీ చేశామని, దానికి సంబంధించిన చెల్లింపులు చేయాల్సి ఉన్నందున అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. దాంతో పాటు విద్యుత్ చార్జీలపై కూడా సమీక్షించి పరిష్కరించేలా చూడాలన్నారు. నిడమనూరు చెరువుకు నాగార్జునసాగర్ మెయిన్ కెనాల్ నుంచి నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అందులో ఓటీ ద్వారా నీళ్లు నింపేందుకు ప్రణాళిక రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దున్నపోతుల గండి, పోతులపాలెం, వీర్లపాలెం భూసేకరణతో పాటు రెండు లిఫ్టులకు ఇది వరకే ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయినందున మిగతా ప్రక్రియపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. మిగిలిన లిఫ్ట్ ఇరిగేషన్ భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న లిఫ్ట్ పనులను, భూ సేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్, ఇరిగేషన్ ఎస్ఈ మల్లిఖార్జున్, ఈఈ కరుణాకర్, డీఈ కేశవ్ పాల్గొన్నారు.

### మిర్యాలగూడ అభివృద్ధిపై కలెక్టర్ సమీక్ష

మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి-నార్కట్‌పల్లి రోడ్డు, వై జంక్షన్, తడకమళ్ల క్రాస్‌రోడ్డు, హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ బ్రిడ్జి, ఎన్ఎస్పీ క్యాంప్ గ్రౌండ్, నందిపాడు బైపాస్ రోడ్డు, మినీ రవీంద్రభారతిని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం పట్టణ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన టీయూఎఫ్ఐడీసీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, షాదీఖానా కోసం అవసరమైన స్థల సేకరణకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యూసుఫ్, తాసీల్దార్ సంతోశ్‌కిరణ్, ఎంపీడీఓ శేషగిరిశర్మ, డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల కుట్రలను తిప్పి కొట్టాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ, మే 10: మతతత్వ ఉగ్రవాద కుట్రలను తిప్పి కొట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉగ్రవాదులు విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 26 మంది అమాయక టూరిస్టులను హత్య చేయడం భారతీయులను కలిచివేసిందని, ఇది దుర్మార్గ చర్య అన్నారు. అందుకు పాకిస్థాన్ కనీసం పశ్చాతాపం ప్రకటించకపోవడం, కాల్పుల ఘటనకు బాధ్యులైన ఉగ్రవాదులను ఇండియాకు అప్పగిస్తామని చెప్పకపోవడంతోనే భారత్ అనివార్యంగా ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసిందన్నారు. యుద్ధ సమయంలో దేశంలో మత విద్వేషాలు రగిల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నాలు చేసే ప్రమాదం ఉందని, అలాంటి వాటి పట్ల అప్రమత్తంగా ఉండి ఐక్యతతో ఉగ్రవాద కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు డబ్బికార్ మల్లేశ్, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, రెమిడాల పరశురాములు, ఎండీ.అంజద్, తిరుపతి రామ్మూర్తి, పాదూరి గోవర్ధని, రామారావు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న అత్తా కోడళ్ల మౌన పోరాటం



తమకు న్యాయం చేయాలంటూ మౌన పోరాటం చేస్తున్న అత్తా, కోడలు

నార్కట్‌పల్లి, మే 10 : తమ భర్తలు తమను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన అత్తా కోడళ్లు యాదమ్మ, దుర్గామల్లేశ్వరి శనివారం ఇంటి ఎదుట మౌన పోరాటానికి దిగారు. తమ భర్తలైన బద్దుల మల్లేశ్, మహేశ్ తమను ఇంటి నుంచి వెళ్లగొట్టారని ఆరోపిస్తూ వారు గురువారం నుంచి ఆందోళన చేస్తున్నారు. తమ భర్తలు ఇంటికి తాళం వేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లారని, గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని వారిని ఇంటికి పిలిపించి తమకు న్యాయం చేయాలని, లేకపోతే ఇంటి ఎదుటే ప్రాణత్యాగం చేస్తామని హెచ్చరించారు. అయితే ఐద్వాతో పాటు పలు మహిళా సంఘాలు వారికి మద్దతు తెలిపాయి. భర్తలపై కేసు నమోదు చేసి భార్యలకు న్యాయం చేయాలని ఆయా సంఘాల వారు డిమాండ్ చేశారు. అయితే దుర్గామల్లేశ్వరి తన మూడేండ్ల పాపతో సహా ఇంటిముందే ఎండలో ఇబ్బంది పడుతుందని, పోలీసులు జోక్యం చేసుకొని ఆమెకు న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ATUL WANTED EXPERIENCED
- Three Wheeler Marketing Sales Executives
- Accountants
- Sales Managers
- Mechanics

Atul Auto available in Electric, CNG Diesel & Petrol
Interested Sub-Dealers for following areas
Kodada, Suryapet, Bhongiri, Choutuppal, Miryalguda
Please Contact:
SWAGATH AUTOMOTIVES
Branches: • Nalgonda: Opp Substation • Mallepally: Opp Rangeela Daba
9505071976
9393287019
To Send a RESUME via WhatsApp

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, Lingampallysatheesh S/o L.Venkanna, R/o H.No.1-7-207/2/11/2/5, Thirumala Nagar, Khammam Road, Suryapet (Dist), Telangana-508123, Have changed my minor Daughter's Name from Lingampally Bhavishya Sri to Lingampally Sanvika.

PLOT FOR SALE
★హయత్ నగర్, కుంట్లూర్ 200 గ॥, పసుమాముల 300 గ॥, లస్కర్‌గూడ 200 గ॥ ప్లాట్లు అమ్మకానికి కలవు (నో బ్రోకర్స్). 9390189907.
NT-331095

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది
బొమ్మకంటి నాగరాజు, S/o. సత్తయ్య, R/o.H.No.A/4, SLBC Camp Colony, గంధంవారిగూడెం, గ్రా॥నల్లగొండ (మం&జి) నా యొక్క ఒరిజినల్ డాక్యుమెంట్ నెం.2687/2016, నల్లగొండలోని బాస్కర్‌టాకీస్ నుండి సాగర్ రోడ్డు వైపు ప్రయాస్తుండగా పోయినది. దొరికినవారు సంప్ర॥9966679282.

FINANCIAL SERVICES
★Sharing-Properties available for Private Finance and Bank Loans around Hyderabad. Visit at KPHB Office. Ph: 7032631468.
NT-336491-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## గ్రామాల్లో ఆటలకు స్థలమేది.?

- క్రీడా ప్రాంగణంలో పెరిగిన కంపచెట్లు
- తుప్పపట్టి పోతున్న పరికరాలు
- పట్టించుకోని అధికారులు



జానిగానితండాలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం దుస్థితి

కొండమల్లేపల్లి, మే 10 : గ్రామీణ ప్రాంత యువతకు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామపంచాయతీలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. యువకులు ఆడుకునేందుకు వీలుగా క్రీడా పరికరాలు, వసతులు సైతం కల్పించింది. వాటి నిర్వహణను గ్రామపంచాయతీలకు అప్పగించింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో వాటి నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా క్రీడా ప్రాంగణాల్లో కంపచెట్లు మొలిచి యువకులు, విద్యార్థులు ఆడుకునేందుకు వీల్లేకుండా మారాయి. మండలంలోని జానిగానితండాలో ప్రధాన రోడ్డు పక్కనే క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణం పూర్తగా కంపచెట్లతో నిండిపోయింది. క్రీడా పరికరాలు సైతం తుప్పు పట్టిపోతున్నాయి. క్రీడా ప్రాంగణం బోర్డు వంగి విరిగిపోయింది. అయినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. సంబంధిత అధికారులు సైతం క్రీడా ప్రాంగణాల నిర్వహణను గాలికి వదిలేయడంతో వేసవి సెలవుల్లో యువత, విద్యార్థులు ఆడుకునేందుకు మైదానం కరువైంది. అధికారులు స్పందించి మైదానాన్ని శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

## రెండు రోజుల పాటు మిషన్ భగీరథ నీళ్లు బంద్

మునుగోడు, మే10 : మండలంలోని పలు గ్రామాలకు 48 గంటల పాటు మిషన్ భగీరథ నీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు మునుగోడు గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు విస్తరణలో భాగంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌లను మారుస్తున్న నేపథ్యంలో మండలంలోని బట్లకాల్వ, రావిగూడెం, సోలిపురం, దుబ్బకాల్వ, కమ్మగూడెం, కార్మికనగర్, లక్ష్మీదేవిగూడెం, మునుగోడు మండలకేంద్రం, రామకృష్ణపురం, తుర్కగూడెం, సానబండ, జక్కలవారిగూడెం గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

## టీఆర్పీ జిల్లా లీగల్ కన్వీనర్‌గా నరేశ్‌కుమార్

నకిరేకల్, మే 10 : తెలంగాణ రిపబ్లికన్ పార్టీ నల్లగొండ జిల్లా లీగల్ కన్వీనర్‌గా నకిరేకల్ మండలం చందుపట్లకు చెందిన పోతుల నరేశ్‌కుమార్‌ను నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నక్క యదీశ్వర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల సమస్యలపై పోరాటం చేస్తూనే పార్టీ బలోపేతం కోసం కృషిచేస్తానని తెలిపారు.

## ఆలయాల నిర్మాణానికి రూ.1.50 లక్షల విరాళం

చందంపేట, మే 10 : మండంలోని తెల్దేవర్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న రాయలయం, శివాలయం, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు వడ్త్య రమేశ్‌నాయక్ శనివారం రూ.1.50 లక్షల విరాళం అందించారు. వీటిని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర జైపాల్ రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, బాలూనాయక్, మహాలక్ష్మయ్య, హరికృష్ణ, చంద్ర య్య, అచ్చాలు, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 17లోగా సర్వేయర్లు దరఖాస్తులు చేసుకోవాలి : కలెక్టర్

రామగిరి, మే 10: భూ భారతి చట్టం – 2025 అమలులో భాగంగా అర్హులైన సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకుగా ఈ నెల 17లోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన సర్వేయర్లకు ఈ నెల 26 నుంచి జూలై 26 వరకు 50 పనిదినాలు శిక్షణ ఇవ్వనుట్ల పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ పరిపాలనకు తోడు ల్యాండ్ రికారులశాఖ ద్వారా 5వేల మంది సర్వేయర్లుకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన సర్వేయర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ వాతావరణం కల్పించాలి

- మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

రామగిరి, మే 10: ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ వాతావరణం కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్సీ అల్గుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. టీఎస్ యూటీఎఫ్, పౌర స్పందన వేదిక ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శిక్షణను శనివారం యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకుడు బీకేరెడ్డి శిక్షణ అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బక్కా శ్రీనివాసాచారి, పెరుమాళ్ల వెంకటేశ్వర్లు, నర్రా శేఖర్ రెడ్డి, నలపరాజు వెంకన్న పాల్గొన్నారు.

## తాళం వేసిన ఇండ్లల్లో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

- 22 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న నగలు, సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

నీలగిరి, మే10 : నల్లగొండ పట్టణంలోని పలు కాలనీల్లో గేటుకు తాళం వేసిన ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని వన్‌టౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో దొంగతనాలు జరుగుతుండడంతో ఎస్పీ ఆదేశాల మేరకు వారిని పట్టుకునేందుకు డీఎస్పీ కె.శివరాంరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ ఏమిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు ఎస్ఐలతో మూడు బృందాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 9 గంటలకు పాతబస్తీలోని బంగారు ఆభరణాల దుకాణం వద్ద ఒక వ్యక్తి బంగారు ఆభరణాలు అమ్మడానికి రావడంతో సమాచారం అందుకున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లి అతడిని పట్టుకున్నారు. నిందితుడు నల్లగొండ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పాలడుగు నరేశ్‌గా గుర్తించారు. నిందితుడు చిన్నతనం నుంచే చెడు వ్యసనాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇతడిపై గతంలో 4 కేసులు నమోదు కాగా జైలుకు సైతం వెళ్లి వచ్చాడు. జనవరి నుంచి ఏప్రిల్ వరకు నల్లగొండ పట్టణంలో 10 ఇండ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఇంటికి వేసిన తాళాన్ని కట్టర్ మెషిన్‌తో కట్ చేసి లోనికి ప్రవేశించేవాడు. చేతులకు గ్లౌవ్స్ వేసుకొని బీరువాల్లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు దొంగతనం చేసేవాడు. ఇతడిపై వన్‌టౌన్‌లో 8, టూ టౌన్‌లో ఒకటి, రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైంది. నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 22 తులాల బంగారు ఆభరణాలు, రెండు కటింగ్ మిషన్లు, ఒక జత గ్లౌవ్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడిని చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐలు సైదులు, సందీప్, గోపాల్‌రావు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

## 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ, మే 10: నల్లగొండ జిల్లాలో యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు ఐకేపీ కొనుగోలు కేంద్రాల ద్వారా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ తెలిపారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 5.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించగా ఇంకా లక్షన్నర టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. సుమారు 80శాతం ధాన్యం కొనుగోలు పూర్తి అయ్యిందని, రైతులకు చెల్లింపులు కూడా చేస్తున్నామని తెలిపారు. వానకాలం సీజన్‌లో ఐకేపీ ధాన్యం కస్టమ్ రైస్ మిల్లింగ్ 98 శాతం పూర్తయ్యిందని, 2 శాతం మాత్రమే మిగిలి ఉందని పేర్కొన్నారు. సీఎంఆర్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ దిగుమతి చేసుకుందని ఆయన తెలిపారు.

## రైస్ మిల్ డ్రైవర్లు, వర్కర్ల వేతనాలు పెంపు

చిట్యాల, మే 10 : చిట్యాల రైస్‌మిల్స్ ఓనర్స్ అసోసియేషన్ వారితో మిల్లు డ్రైవర్లు, వర్కర్ల వేతనాలు పెంచుతూ కొత్త వేతన ఒప్పందం కుదుర్చుకున్నట్లు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం రైస్‌మిల్లు ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో రైస్ మిల్లు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు జరిపిన చర్చల్లో డ్రైవర్లకు ప్రస్తుతం ఉన్న వేతనంపై రూ. 2,250లు, కూలీలకు రోజుకు 12 గంటల పనికి రూ.60లు, 8 గంటల పనికి రూ.40లు అదనంగా ఇవ్వడానికి మిల్లుల యజమానులు అంగీకరించినట్లు ఆయన వివరించారు. కార్మికులు, యాజమాన్యాల మధ్య జరిగిన చర్చల్లో మధ్యవర్తిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తెరటుపల్లి హన్మంతు, కార్యదర్శి పోలా పెద్దయ్య, మిల్లర్లు పందిరి శ్రీను, వేలుపల్లి శంకరయ్య, వనపర్తి వెంకటేశ్వర్లు, రమేశ్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అవిశెట్టి శంకరయ్య, మిల్లు డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఏళ్ల మారయ్య, కార్యదర్శి తిరుపతి పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లకు కౌన్సిలింగ్

రామగిరి, మే 10: ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశానికి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ బలరాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న బాలురు, 16న బాలికలకు మిర్యాలగూడలోని అవంతిపురం గిరిజన సంక్షేమ గురకుల ప్రతిభా కళాశాలలో కౌన్సిలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. అర్హులలైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని హాజరుకావాలని సూచించారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

దామరచర్ల, మే 10: బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొండ్రపోల్ గ్రామం నార్కట్‌పల్లి–అద్దంకి ప్రధాన రహదారిపై శనివారం చోటు చేసుకుంది. వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం గూడూరు క్యాంపు బోట్యానాయక్ తండాకు చెందిన బానోతు హనుమంతు(45) దామరచర్ల మండలం కల్లేపల్లి గ్రామానికి బైక్‌పై బయల్దేరాడు. కొండ్రపోల్ గ్రామం వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వాడపల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరి యా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నకిరేకల్ : తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

నకిరేకల్, మే 10 : మండలంలోని మంగళపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 2000–01 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం పాఠశాల ఆవరణలో నిర్వహించారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు కనకాచారి, మల్లికార్జున్, రామకృష్ణ, వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నకిరేకంటి వెంకటేశ్వర్లు, నర్సింగ్ రాములు, దయాదుల పిచ్చిరెడ్డి, ముత్తినేని శ్రీనివాస్, మంగినపల్లి జానయ్య, బచ్చుపల్లి రాజు, సిద్దు, సైదాచారి పాల్గొన్నారు.

### మర్రిగూడ జడ్పీహెచ్ఎస్‌లో

మర్రిగూడ : మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో 2005–06 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం స్థానిక ఫంక్షన్‌హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. అంతకుముందు పాఠశాలను సందర్శించి తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి ఉపాధ్యాయులు పాల్వాయి జగతిరెడ్డి, యాదగిరి రావు, ప్రవీణ్‌కుమార్, రాములు, కృష్ణయ్య, జీవరత్నం, మేరి, రంగనాయకమ్మ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మర్రిగూడ : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు



సైనికుల తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామస్తులు

## ఆర్మీ జవాన్ల అమ్మానాన్నలకు పాదపూజ

త్రిపురారం, మే 10 : ఆర్మీలో పనిచేస్తున్న వీర జవాన్ల అమ్మానాన్నలకు నల్లగొండ జిల్లా త్రిపురారం మండల కేంద్రంలో శనివారం పాదపూజ నిర్వహించారు. పూణె బెటాలియన్‌లో పనిచేస్తున్న నగిరె శ్రీధర్, శ్రీనగర్ జమ్మూకాశ్మీర్‌లో పనిచేస్తున్న పడిశెల మహేశ్, ఏఓసీ అస్సాంలో పనిచేస్తున్న బొడ్డు ఆంజనేయులు తల్లిదండ్రులకు త్రిపురారం గ్రామస్తులు, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు అనుముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదపూజ చేశారు. ఈ సందర్భంగా వీర జవాన్ల తల్లిదండ్రులు నగిరె రామకృష్ణమ్మ – మల్లయ్య, పడిశెల వెంకమ్మ – చిన్న మట్టయ్య, బొడ్డు సాలమ్మ – పర్వతాలును శాలువాలతో సత్కరించారు. ప్రధాన సెంటర్‌లో అందరికీ స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగిలి శ్రీనివాస్‌యాదవ్, చింతకాయల యాదయ్య, పులిజాల విష్ణుకుమార్, షేక్ దస్తగిరి, ఆదినారాయణ, శేఖర్, నగిరె వెంకన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నా నెల జీతం ఎన్డీఎఫ్‌కు ఇస్తా : మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ ప్రతినిధి, మే 10 (నమస్తే తెలంగాణ) : శాసన మండలి చైర్మన్‌గా తన నెల జీతాన్ని నేషనల్ డిఫెన్స్ ఫండ్‌కు విరాళంగా ఇవ్వనున్నట్లు గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణలోని మిగతా ఎమ్మెల్సీలు కూడా తమ వేతనాలను విరాళంగా ఇవ్వాలని ఆయన సూచించారు. నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. భారత్ యుద్ధ నీతిని పాటిస్తూ పాకిస్థాన్‌తో వీరోచిత పోరాటం చేస్తోందన్నారు. ఉగ్రవాదులు ఉన్న ప్రాంతాలపైనే భారతదేశం దాడులు చేస్తోందని, పాక్ అందుకు భిన్నంగా భారత్ పౌరులపై దాడి చేస్తోందని మండిపడ్డారు. పాక్ యుద్ధ నీతికి వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని, పీఓకే స్వాధీనం చేసుకుంటే తగిన బుద్ధి చెప్పినట్లు అవుతుందని అన్నారు. ఈ సమయంలో భారత్ పౌరులందరూ దేశానికి మద్దతుగా నిలబడాలని సూచించారు. జవాన్ మురళీనాయక్ మృతి బాధాకరమంటూ ఆయనకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు.

## పాక్‌తో యుద్ధంలో తమ పరాక్రమాన్ని చాటిన భారత ఆర్మీ

- పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మెమొంటో అందిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, పక్కన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

మునుగోడు, మే10 : పాకిస్థాన్‌తో యుద్ధంలో భారత ఆర్మీ మరోమారు తమ శౌర్యాన్ని చాటిందని, భారత సైన్యానికి విజయం సిద్ధించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని కోతులారం గ్రామంలో శనివారం నిర్వహించిన కేదారేశ్వరస్వామి ఆలయ తృతీయ బ్రహ్మోత్సవ కార్యక్రమంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పున్న కైలాశ్‌నేత, నాయకులు పాల్గొన్నారు.

## విద్యుత్ దీపాల వెలుగుల్లో బుద్ధవనం



విద్యుత్ దీపాల వెలుగుల్లో బుద్ధవనం

నందికొండ, మే 10 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని బుద్ధవనాన్ని అధికారులు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల సుందరీమణులు ఈ నెల 12న బుద్ధవనాన్ని సందర్శించనున్నారు. దాంతో అధికారులు బుద్ధవనాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. బుద్ధవనం ఎంట్రెన్స్ ప్లాజా, దర్మచక్రం నుంచి మహాస్తూపం వరకు మార్గం, మహాస్తూపం చుట్టూ ఉన్న పార్కు, గోపురం, ధ్యానమదిరం, జాతకపార్కులో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. శనివారం విద్యుత్ లైట్ల అలంకరణను అధికారులు పరీక్షించారు. బుద్ధపూర్ణిమ వరకు బుద్ధవనాన్ని పూర్తి స్థాయిలో అలంకరిస్తామని నిర్వాహకులు తెలిపారు.

### రోడ్లన్నీ శుభ్రం

పెద్దఅడిశర్లపల్లి : అందాల పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల పోటీదారులు ఈ నెల 12న హైదరాబాద్ నుంచి బయల్దేరి నాగార్జునసాగర్‌కు రానున్నారు. వారు ప్రయాణించే సాగర్‌హైవేపై ఉన్న మాల్, చింతపల్లి, మల్లేపల్లి, పెద్దవూర గ్రామాల్లోని రోడ్లను అధికారులు శుభ్రం చేస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పరిసరాలను, డివైడర్‌ను శుభ్రం చేస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

## ప్రశాంతంగా టీఎస్ఆర్జేసీ సెట్

రామగిరి, మే 10 : తెలంగాణలోని రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి శనివారం నిర్వహించిన టీఎస్ఆర్జేసీ సెట్ ప్రశాంతంగా ముగిసినట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 33 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 7889 మంది విద్యార్థులకుగానూ 8759 మంది హాజరయ్యారని, 1090 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

## వీర జవాన్ మురళీనాయక్ పోరాటం చిరస్మరణీయం

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దస్రూనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న దస్రూనాయక్

కొండమల్లేపల్లి, మే 10 : భారత్–పాక్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ సరిహద్దు వద్ద చూపిన పోరాట పటిమ చిరస్మరణీయమని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మన దేశంలోకి చొరబడే వారిని తుదముట్టించి వీరమరణం పొందాడన్నారు. దేశ రక్షణలో అసువులు బాసిన మురళీనాయక్ అమరుడన్నారు. దేశ రక్షణలో అయన చూపిన ధైర్యసాహసాలు, పోరాట పటిమకు యావత్ దేశం గర్విస్తోందన్నారు. చిన్న వయసులోనే మృతి చెందడం బాధాకరమని, మురళీనాయక్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట రమావత్ శంకర్‌నాయక్, రూప్లానాయన్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా హైమాస్ట్ లైట్ స్తంభం



రసూల్ పురం గ్రామంలో ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభం

నల్లగొండ రూరల్, మే 10 : నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని రసూల్‌పురం గ్రామంలో ఉన్న హైమాస్ట్ లైట్ స్తంభం పూర్తిగా ఒక వైపునకు ఒరిగి ప్రమాదకరంగా మారింది. ఈదురు గాలులకు లైట్ స్తంభం పూర్తిగా ఒక వైపునకు వాలిపోయింది. అది కూలి దారిన పోయే వారిపై పడితే వారి ప్రాణాలు పోవడం ఖాయం. ప్రస్తుతం ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్న తరుణంలో హైమాస్ట్ లైట్ స్తంభం ఎక్కడ కూలుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి స్తంభాన్ని సరి చేయాలని, లేదా వేరే స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.